# దాన్నేటనక

‘‘నానెల్లనంటెల్లనంతే ! నన్నేటనక ! నాకేటో అయిపోతంది. కల్లగుపడ్డం నేదు. మసకలడిపోత్తన్నాయి.... కాల్లు లొటలొటలాడిపోతన్నాయి. నాకేటి బాగనేదు. నన్నేటనక !’’ గయిరమ్మ చెప్పేసింది.

‘‘అదేటి బొట్టి అనగ సతికిలపడిపోనాది. నానేటి సేతును బగమంతుడా !’’ అంటూ లబలబలాడింది గయిరమ్మ తల్లి అప్పాయమ్మ, అప్పటికప్పుడే ఆప్యాయత ముంచుకొచ్చి.

‘‘ ఏటొహ అలగయిపోతన్నావ్ ? పుట్టింటి మీద దీవేసినాదేటో. సూడ్డానికి పారొచ్చినాది... యియలే ఎల్లాలని ఏటా ము(వూర్త(వూ ! ఓ రెండు పూటలుండీ ఎల్తాది.... నువ్వేటలా గుండయిపోతన్నావ్ !’’

అసిరయ్య చుట్ట మరో మారు పీల్చి చూసి ఆరిపోయిందని ఖాయం చేసుకొని దడివారకి విసిరేశాడు.

గయిరమ్మ ముణుకుల్లో తలపెట్టి అలికిన నేల వైపే చూస్తోంది.

‘‘ ఇదేటమ్మ బొట్టిలగయిపోతంది ? ఏటీ సెప్పు... నీరసం గుందేంటే ? ఏదైనా సందడి జేస్తంది గవుర్లో బొట్టి !’’

అంతలోనే గయిరమ్మ కోపం పోయింది. ఆందోళనా పోయింది మరో రకమైన ఆత్రం ఆమె గొంతులో ఊగిసలాడింది.

‘‘ ఏటయిందే. నాతో సెప్పరాదేటే ?’’ మురిపెంగా అడిగింది అప్పాయమ్మ.

‘‘సందడీ నేదేట్నేదు. నువ్వూరుకోయే. పేనాలు కడంటినే సత్తా ఉంటే నీ గోలేటి ?’’

‘‘పోనూర్కోయే. నువ్వెల్లి నీల్లొట్టుగొచ్చీ బొట్టి నాకు కసింత నూనె మద్దనా సేత్తాది. రాయమ్మ కాల్లు లాగేత్తన్నాయి. రాయే తల్లీ సచ్చి నీ కడుపున బుడతా !’’

జబ్బు మనిషి బతిమాలాడు.

‘‘సత్తావ్ సరే ! దీని కడుపునెలాబడతవేటి ? అది మనువుకెల్లదు. నాను సచ్చీ సెడీ ఏనాగో ఓనాగపిప్పీ పిసరూ పోగు సేసి అల్లకాడికి తీసుకెళితే. ..అయన్నీ ఆడనే ఒగ్గేసి ఇటు లగెత్తుకొచ్చేస్తాది. ఇనగప్పటికి ఎన్ని సుట్లయినాదో నువ్వెరగవా ? నీ కాళ్ల పీకులు ఎప్పటికైనా తగ్గవేనేటి ? దాని మనువు ముక్కె(వా. నీ సేవ ముక్కె(వా ?’’

అప్పాయమ్మ మళ్లీ స(రుమని లేచింది.

‘‘అదేటి సిన్న కూనేటి ? నా(నానేదూ. ఇంత గుంటని ? ఆవిటికో, సంకురాత్తిరికో ఎలితే ఎల్లినాను. నేకపోతే నేదు. మనువు కిచ్చిన బొట్టి మన కాడెందుకుండాల ? నానెప్పుడేనా ఇలగెరుగుదువా. నువ్వెన్నా సెప్పు ! అదెన్ని ఏసికాలైనా ఎయ్యినీ, అదెల్లిపోక తప్పదు. అత్తోరింటి కాడుండడం మానీసి బొట్టి కన్నారింటి కాడెందుకుందని అల్లూ, ఆల్లూ, ఈల్లూ, ఇరుగూ పొరుగూ సెవులు కొరుక్కుంటుంటే నాకేటో కడుపుల యికారంగా ఉంటాది. మనవేటి ఏనాడైనా మాట పడెరుగుదువా ? బొట్టి మనకాడుండడం మనకి బాగున్నా సూసే ఓల్లకి బాగోదు. పొద్దుటి బండికి నువ్వు బయలెల్లాల్సిందే !’’

అప్పాయమ్మ చట్లన్నీ సర్దేసి మూలనున్న కడవ పట్టుకొని వీథి చివర కొళాయి కెళ్లిపోయింది.

అసిరమ్మ కంట్లో నీళ్లు తిరిగాయి. ''సూసినావే గయిరీ.... యింకేటీ ఇననన్నట్టు అదెల్లిపోనాది. పోన్లెయే. దాని మాట ఇనుకో. దాని బాద దాంది. దానిదీ మంచి మనసేనే. నీ కోసవే కదా సెపుతంది!''

'' ఊరుకో అయ్యా!'' గయిరి లేచి మూలనున్న నూనె సీసా తీసింది. '' ఇదేట్రయ్యా ఇందల నూనెయిపోనాది నేనెల్లి ఒపావలా నూనొట్టుకొత్తా''.

పెణక కింద ఒంగి అడుగున్నర మనిషైపోయి గభాలున బయటపడింది గయిరమ్మ.

అసిరయ్యకు చలీ, ఒణకూ వచ్చాయి. నులక మంచంమీద నుంచి వంగి చుట్ట వెలిగించుకోవడానికి మంచం కింద తంపి తడివాడు. నిప్పురవ్వ దొరుకుతుందేమోనని చూశాడు. తంపి వెచ్చగా తగిలింది కాని, లోపల నిప్పు ఎప్పుడో వూసిపోయింది.

కొళాయి దగ్గర మాటలు అసిరయ్య చెవిని పడుతూనే ఉన్నాయి.

''అర తులం బంగారఁవెట్టి బొట్టిని మనువిచ్చినాం. ఇత్తడి బిందీ, తపేలా, రెండు గళాసులూ, రెండు సిలవరి గిన్నెలూ, సెంబూ ఎట్టినాం. అయిన్నీ ఒట్టుకెల్లి ఆల్లకిచ్చి ఒచ్చినాం. అయినా, ఇదెందుకో అడుండదాని కొప్పుకోకుండేంది. ఆల్లయినా మంచోల్లే. మాటా మాటా అనుకున్నారేటీ అంటే అదెల్లేదని పల్లకుంటది. ఆల్లకి సిన్న మడి సెక్కా ఉంది. పుట్టెడు మిరపకాయలూ, నాలుగు; బస్తాలు ఏరుచెనగా పండించుకుంటారు. ఒక గేదె, నాలుగు మేకలూ ఉన్నాయి. వానొచ్చి పనుల ముమ్మరపు రోజుల్లో ఇదిక్కడికి పారొచ్చినాది.... ఇలగింటప్పుడేల పార్రావాల? అడి ముడుకుల నొప్పులు ఈనాటివేటి? పోనీ ఒచ్చినాది. గుడ్డముక్కొక్కటి కొన్నాను గందా నల్ల గెల్లరాదా? ననితమ్మగోరు గాజు లేయించుకోయే అని. అయిదు రూపాయల నోటు చేతులెట్టినార.''

''అనగయితే అప్పాయమ్మా, నీ ఇయ్యపురాలేటందా? అల్లుడు మంచోడు కాబట్టి సరిపోనాది నేకపోతే గొడవైపోద్ది జాగర్త. ఇంతకీ నీ అల్లుడేటంటాడో?''

'' అడేటంటడు? దీనికి పుట్టింటిమీద దీవేసి, లగెత్తుకొస్తంటే?''

''పొయ్యి రాజేసినావా?'' అంటూ మరొకావిడ కడవపట్టుకొని రావడంతో తన కడవ నెత్తికెత్తుకుని బయటపడింది అప్పాయమ్మ. చీకటి పడుతోంది. అప్పాయమ్మ పొయ్యిలో నిప్పు పొరుగింటి నుంచి తెచ్చివేసింది.

అసిరయ్య చుట్ట ముట్టించుకున్నాడు.

''గయిరీ అదేటే అలా కూకున్నావ్! లేచి కొప్పు దువ్వుకోకూడదా! అడికి కాలు అలా రాస్తా ఉంటే ఇక సాలనడు. పొద్దు వాలిపోతంది. లేలే. నే రాస్తాగా ఎల్లి మొకం కడుక్కో...''

మెల్లిగా లేచింది గయిరమ్మ.

'' ఓరయ్య ఇదేటో నాకు బయ్యంగుంది. ఇదేటి తగువెట్టుకొనొచ్చీ నేదు కదా!''

'' ఎల్లెహె! దానికి తగువాడ్డాలోటి తెలుసునేటి? అయినా ఆడకూతురు కన్నోరింటికి రాకోడదేటే?''

''అలా కాదునే. నాకేదో బయ్యంగుంది. బొట్టి ఎల్లనేదేటీ అనడిగితే నేనేటి సెప్పాల. గూడెంల మనవంటె ఎంత ఇదో నీకు తెల్సుగందా! ఎరకయ్యి పెళ్లాం కన్నేయం జరిగిపోనాదంటే ఆల్ల తగవు

మనం తీర్చనేదా ? అల్లిప్పుడు మన పేరు సెప్పుకు సల్లగుండడం నేదా ? దీని బుర్రలేటుందో నాకు సెప్పకపోతే దాని నేస్తం పారమ్మక్కకి సెప్పిందేటో...''

చటుక్కున లేచిపోయింది అప్పాయమ్మ '' ఏటి ?'' అనడిగినా బదులు చెప్పకుండా సరసర బయటకొచ్చింది.

పారమ్మా , గయిరీ చిన్ననాటి నుంచి నేస్తులు. అయితే, పారమ్మ గయిరి కంటె ఓ రెండేళ్లు పెద్ద. మనువుకెళ్లిన అర్నెల్లకే మొగుడికి ఉబ్బసంలోంచి మరెందులోకో దింపేసి నాలుగు వారాలు ఆస్పత్రులంట తిరిగి లాభం లేదంటే ఇంటికొచ్చేశాడు. వచ్చిన వారంలో కళ్లు మూసేశాడు.

ఎందరో చెప్పారు మళ్లీ మనువు కుదుర్చుమని. పారమ్మకి రివిన్యూ ఇన్స్పెక్టర్ గారింట పని. వాళ్లమ్మాయితో చనువు. వాళ్లమ్మాయికి పారమ్మంటే ఎంతో ఇష్టం. గంటల కొద్దీ దానితో కబుర్లు చెబుతూనే ఉంటుంది.

ఆ అమ్మాయి చెప్పినా పారమ్మ వినలేదంటారు వీధిలో ఆడాళ్లు.

''పెళ్లి ఒక్కపాలేనే. నీ తన్నది ఎవురకయినా ఒకటే కాదా ! నా బతుకిలాగయిపోనాది. అయినా నా బ్రతుకు నే బతకనేకపోతానేటి ? అన్నిటికీ ఆ బగమంతుడే ఉన్నాడు.''

తను చెప్పినప్పుడు కూడా ఇంత చిన్నపిల్ల ఇలా మాట్లాడగలగడమేంటని ఆశ్చర్యపోయింది అప్పాయమ్మ.

'అయినా, పారమ్మ సెడ్డ నికార్సయిన బొట్టి. నీ ఒల్ల ఈ పని కావాలే అంటే కాదు పొమ్మందు... పేనం ఇచ్చేస్తాది.'

ఎన్నోమార్లు తనే పొగిడింది పారమ్మని. ''పారీ...'' గుడిసె ముందు నుంచునే పిలిచింది అప్పాయమ్మ.

''పెద్ద ఈదిలమ్మ గారింటికెళ్లింది.... అల్లింటికెవరో వత్తన్నారంట. ఆ బొట్టికి సూపులేటో. దీనికే సందడంతా. ఒదినా బొట్టొచ్చినాదుట కదా... ఏటి సేసం? అర్రె గడప దగ్గరుండిపోనావేటి. నోపల కొచ్చి సినావ్ కాదు !''

'' ఏం నేదు నేయే. ఆడికి కాల్లు పట్టు. బొట్టిని రేపినా దిగబెట్టిదాంవంటే అదేటో ఇంకా ఉంటానంటాది... రాయే కోడలా... ఏటి సూపులంట. బూరి ముక్క దొరుకుద్దా !''

'' అం ! నువ్వేడత్తోయ్ ఇలగ పారొచ్చినావ్ ? గయిరేటి సేస్తంటి ? ఏం సూపుల్లేయ్ కట్నాలూ గట్రా పాతిక వేలడిగినారట. పెద్దమ్మగారు కూకిలపడిపోనారు.''

– అప్పాయమ్మకి ఇది మంచి అదుననిపించింది. పారమ్మ వాల్చిన మంచం మీద కూర్చుని వాళ్లమ్మ వెళ్లిన వెంటనే అడగాలనుకున్నది అడిగేసింది.

''నీకేటయిన సెప్పిందేటే ! అత్తింటికెల్లడానికి ఏ బొట్టయినా ఊం ఎగిరిపోతది గదా ! మాగయిరేటే ఇక్కడుంటానంటాది. సిన్న గుంట మొగుడు...'' ఇంకా ఏదో అనబోయింది. కాని, పారమ్మ ముఖం చూసి ఆగిపోయింది. పారమ్మ మాత్రం ఏం పెద్దది కనక...

''పోన్లేయత్తా. నాలుగు రోజులుండనీ దాని మనసుకి బోద కలిగితే అదే ఎళతాది.''

''దానికి మనసు బోదా ? ఇదేటే ? అల్లేటయినా అన్నారా ? కన్న తల్లిని నాతో సెప్పకుండా...''

'' నువ్ అలా గందిక సెయ్యకు... నీ కన్నీ గాబరాయే సెప్పడాని కేటుందనీ.''

''మనసు బోదన్నావ్. అల్లేటి దీన్నేటన్నారా, సేసేరా ? నాకు తెలవకపోతే ఎనగే. తల్లి తల్లి సచ్చినీ కడుపును బుడతా సెప్పమ్మా. మన సంగతి అల్లకి తెల్దు. నా పిల్ల నేటంటే నే నూరుకోను కాకూరుకోను. ఏటయిందే ?''

'' ఏటవనేదే !'' మెల్లగా అంది పారమ్మ.

''సెప్పకపోయినావంటే నా మీద ఒట్టే !''

''అంత మాటనకత్తా ! మనువు లివ్వడానికి మనవాల్లకి సంబరమే కానీ సేసుకుంటున్నాల్లెపింటోల్లో సూసుకోనక్కర్లేదా ?''

అప్పాయమ్మకి ముల్లు గుచ్చుకున్నట్లయింది. పారమ్మకి మనువు కుదిర్చిన పెద్ద మనుషుల్లో తనూ ఉంది. వాడికి జబ్బున్న మాట తను బయట పెట్టలేదన్న తనమీద విసురు తెలుసుకోనంత సత్తెకాలపు మనిషి కాదు అప్పాయమ్మ.

''నా కరమ ఇనాగుంది. అడికి మాత్తరం సచ్చిపోవాలనుందేటి ? జబ్బు సేసినాది సచ్చిపోనాడు. ఈడికేటి పోయికాలం ? ఇంట మనువాడిన ఆడదుండగా పోకిరీ ఎదవ పనులూ ఈడూ – ఏటైనంటే నీకేటి తెల్దు నువ్ నోరు మూసుకోయే అంటాడట. దీనికేటి తెలియాలే. ఆలూ మగలూ బతుకుతున్నారు కదా. అడికి తెలిసి దీనికి తెలందేటి ? కాపరం సేత్తన్నా దీనికి తెలిసిన పాటి కూడా అడికి తెల్దు. అడికంటే ఒయసులో పెద్దదే వావి వరస కానిదే. ఛీ ఛీ. అమ్మాయి గోరన్నట్టు పసరాలకి వావేటి వరసేటి ? వయసేటి సిగ్గేటి ? మావసం తింటావని దుమ్ములు ఏలేసుకు తిరుగుతామా? దాని బాద దాన్ది. దాన్నేటనక. ఒక్కసిటం...''

ఒక్క క్షణం కూడా ఆగలేదు అప్పాయమ్మ రివ్వున తారాజువ్వలా లేచింది.

'' ఓలమ్మోలమ్మో ! ఇదెక్కడిదీ గోరఁవూ. నా బొట్టికింత అన్నేయం సేత్తాడా ? ఇది నిజవే అయితే అడి పరువు పీకి పందిరేయించేస్తానే గానీ నా నొల్లకోను.''

సిసింద్రిలా చిరమరలాడుతూ అలంగం తిరుగుతుంటే పారమ్మకి భయం వేసింది. సిగ్గేసింది కూడా.

''అత్తా, ఇలపింటివి తగుఁవు లెట్టుకుంటే ఏటి నాబం ? అల్లకి నీతి నేకపోతే మనం సూసీ సూడనట్లు ఊరుకోనేనా ఊరుకోవాల. నేకపోతే తెలియనట్టేన ఉండాల. ఇవి బయలెట్టుకుంటే మనకే సిగ్గు. మొగోళ్లంటే నంతేనంటుంది మా అమ్మాయిగోరు. దయిర్రెం ఉండే ఆడదాని కాల్లమీదది నుంచోవాలంట. పున్నెం కొద్దీ పురుసుడని సరిపెట్టుకోక ఎదురు తిరిగితే అదో తుప్పంట.''

అమ్మాయి గారి ఆలోచనలు తన మాటల్లో చెప్పబోతుంటే అప్పాయమ్మకి మరి వినాలనిపించలేదు.

పుట్టెడు ఆలోచనలతో ఇంటికొచ్చింది అప్పాయమ్మ. రావడమే ఎన్నడూ లేనంత నిశ్శబ్దంగా, గంభీరంగా, హుందాగా వచ్చింది.

పొయ్యి రాజేసి వంట ఏర్పాటు మీద దృష్టిపెట్టింది.

'' ఎక్కడికెల్లావేటీ ?'' అసిరయ్య అడిగాడు. తనకు తెలిసినప్పటినుంచీ ఎన్నడూ ఇంత నిశ్శబ్దంగా తన ఆడది ఉండడం ఎరగడు అసిరయ్య.

''బువ్వెడతా రాయే !'' అని తల్లి పిలిచినప్పుడు, చట్టిలో కూడు కంచంలో పెడుతున్నప్పుడు, అప్పాయమ్మ కళ్లలోకి చూసి అంతటి వెలుగు అమ్మకళ్లలోనా అని గాభరా పడింది గయిరి.

''అదేటోలమ్మ ఆ తిండి. కడుపు నిండా తినే... జాతి తక్కువ పన్లు చేసినోల్లకుండాలే బయ్యం. నీకేల బయ్యం...'' అంటుంటే గయిరమ్మ వింతగా చూసింది.

తెల్లారలేదు. ఇంట్లోంచి ''నా కోసం కూడొండకు'' అంటూ బయలుదేరి పోయింది.

అసిరయ్య ఇంకా నిద్ర లేవనే లేదు. బండి దిగడమేమిటో చేతులు విసురుకుంటూ రీవిగా కోసుడు దూరం నడిచి బారెడు పొద్దెక్కేసరికి వియ్యాపురాలింటి ముందు ఆగింది.

'' ఒదినా ...'' ఒక్కటే గర్జన.

'' ఓలమ్మ. అప్పాయమ్మా, బొట్టేదీ?''

''బొట్టేదో నీకు తెలదా ? నీ కొడుకెవత్తెనో, వాయీ వరసా నేకుండా, ఆడికంటె పెద్ద దాయితో కులుకుతుంటే బొట్టేల ఆడికి. ఈ ఏసాలు నాకు గిట్టవు. పది మందికి తగువు సెప్పే నోల్లం కాని... తగువులెట్టే ఓల్లం కాదు.''

'' ఏటది. నువ్వేటంటన్నావ్ ?''

'' ఏటంటన్నానా ? నీకు తెల్దేటి ? ఆతగోడేడీ ?''

''రేత్తిరికి పట్నం ఎల్లినోడు. మీ కాడకే వచ్చినాడనుకున్నా.''

''మా ఇంటికి రానేదు గాని, నా కూతురు మనువు తెగతెంపులు చేసుకోవాల నొచ్చినా. నే సెప్పింది నీకు తెలీంది కాదు. నా కంటే కల్లు లేకపోయాయి కాని, దానికి మనసుంది. నానే తెలుసుకోలేకపోయినాను. దానికిచ్చిన సారె, అదీ మీరే ఉంచుకోండి. తగువెట్టాలనుకుంటే మా ఊరొచ్చి మా పెద్దోల్లకి సెప్పి బొట్టిని తీసుకెల్లమను. మూడు రోజులు గడువు. నాలుగో రోజు నేను బొట్టికి మరో మనువు కుదర్సకపోతే నా పేరు అప్పాయమ్మ కాదు. నేను అసిరిగాడి ఇల్లాల్నే గాదు.'' ఆ వీథిలో అటో ఇరవై ఇటో ఇరవై గడపలున్నాయి. సల్లందుల వేళేమో ఆడా మగా అంతా ఇళ్లల్లోనే ఉన్నారు.

అప్పాయమ్మ గొంతులోని ఆక్రోశం అందరినీ వెన్ను తట్టి వీథిలోకి లాక్కొచ్చింది. చుట్టూ చేరుతున్న మనుషుల్ని ఒక కంట కనిపెడుతున్న అప్పాయమ్మ చటుక్కున తను చెప్పదలుచుకున్నదేదో చెప్పేసింది. తగువెట్టినా ఇంక ఇంత కంటె చెప్పేదీ, చెప్పగలిగిందీ లేదనీ ఆమెకు అనుభవం నేర్పింది. అనవలసిన మాటలైపోయాయి. వాటికి జవాబు కోసం చూడవలసిన అవసరం లేదు. జవాబు లేదు నిజానికి. – గిరుక్కున తిరిగి అప్పాయమ్మ వచ్చేస్తుంటే వాడలోని మనుషులెవరూ ఆమెను అడ్డగించలేదు. అప్పాయమ్మ అల్లుడి తరపున ఎవరూ వకాలతా పుచ్చుకోనూ లేదు. వాళ్ల ముక్కుమీద వేళ్లు చూడడానికి ఆమె ఆగనూ లేదు.

అర ఫర్లాంగు దూరం నడిచేసరికి ఎదురుగా అల్లుడూ, అతని పక్కన ఓ ఆడమనిషీ.

''అత్తా...''

'' ఎవడ్రా నివ్ ? నీకు నేను అత్తనా. ఇదేనట్రా నా కూతురు కాపరంలో బుగ్గోసిన నంజకాన ! మీయమ్మకి సెప్పినా... బుద్దిగా మూడు రోజులు తిరగకుండా వచ్చి నా బొట్టిని తీసుకెల్లి కాపురం సేసుకుంటావో, దీనితోనే కులుకుతావో నువ్వే సూసుకో. కూడిక్కరువైతే నీతికి కరువు కాదు మా ఇంట... నంగనాచి ఏటా సూపు. ఏటే... నువ్వెవరు ? ఈడికీ, నీకూ సంబంధమేటి ? ఈడితో రేత్తిరి పట్నంల. సీఛీ. సిగ్గులేని మొగం...''

తుపుక్కున ఉమ్మేసి ముందుకు నడిచింది అప్పాయమ్మ.

ఇంటికి రావడమే గాలివానలా వచ్చింది. నిన్నటి ప్రశాంతత. నిన్నటి నిశ్శబ్దమూ, నిన్నటి నిబ్బరమూ ఏమైపోయాయో !

" ఈడి సిగదరగ. ఈడి అన్నేయం ఆరిపోనూ. ఈడికి బుద్ధి గడ్డి తింటే ఆడదాయె పైగా కాపరం సేస్తన్నాది. దాని కుండద్దా... ఇంత మనిసి ఉన్నది గేదనాగ. పిటపిటలాడిపోతంది. సిగ్గోగ్గేసిన ఆడది ఆడదేటి నెద్దూ. రోడ్డు మీదే పొర్లే పసరం."

– అసిరయ్య అన్నాడు " ఏటే ఇదంతా !"

"నువు సేసిన నిరవోకం. నా కల్లతో నే జూసినాను. నా కూతురుకి మరో మనువు సూడు. ఆడెవుతెనో ఎంటేసుకుని పసువులా ఊరేగుతున్నడు. ఆడికి మూడ్రోజులు గడువిచ్చినా, నెల తిరక్కుండా దీనికి మరో మనువు సూసి ముడెట్టేయాల. ఇంతకీ బొట్టేదీ ?"

"నారమ్మొచ్చినాది. అదీ, ఇదీ ఏడకో ఎల్లినట్టున్నారు."

"దీనికి వెంటనే మనం మరో మనువు సూసీయాల. మూడు రోజులు కాదు. మూడేల్లయినా ఆడొత్తాడని నేననుకోను. అంత సిగ్గుమాలిన మడిసి నా కూతుర్ని సంపేసినా సంపేత్తాడు. గాజుబొమ్మ నా కూతురు. అదేటనగ బలిసిన రెండీతల గేదనాగున్నాది. ఆడికాడికి అదెల్లినా నేనంపను."

అసిరయ్య మారు మాటాడకుండా వింటున్నాడు. "సేతనయితే తగువెట్టి తీసుకెల్లమని సెప్పి ఒచ్చేసినాను. ఊర్ల జనమంత ఇరగబడి సోద్దెం జూత్తన్నారు. కాని, ఒక్కలడగనేదు. ఇదేటే ఈ గోరంవని. ఆడి దెయిర్రం ఎటో నాకూ తెనుసు. కాని, అలపింటోడి కాడికంపి మన బొట్టి బతుకు అద్వానం సెయ్యడం నాకు తల తీసేసినట్టుంటాది."

అప్పాయమ్మ గొణుగుతూనే ఉంది.

– పొద్దు గుంకుతుండగా కారెజీ గిన్నెలో అమ్మాయి గారిచ్చిన దేదో పట్టుకొని గడపెక్కింది గయిరి.

"నా తల్లి నా తల్లి." అంటూ గుండెల్లోకి తీసుకుని బావురుమంది అప్పాయమ్మ.

"నా కల్లతో నేను జూసినానే. ఇంత అన్నేయం ఈ ఊర్లో ఎవరూ పట్టించుకొనేదా ? నీతి మంట గలిసిపోనాదా ? నీకేటి బయం నేదు. మా పింతల్లి కొడుకు కోవటుల్లి మిల్లులో పన్జేస్తున్నాడు. కబురంపి నీకు మనువు కుదిర్చేస్తా !" అంటూ ఆమె తల నిమిరింది.

" ఎవరికే నువ్ మనువు కుదుస్తావ్ ! ఆడికి నీతి లేదనిఁ మనం గడ్డి కరుస్తావా ? ఆడితో నాకు మనువయింది. అది మంటగలిసిందనుకో. మరో మనువెల్లకపోతే సచ్చిపోతానా ? ఆడికి నీతినేదు. సరే. మరి మనసంగతేటి? ఆడదానికి పెల్లొక్క పాలేనటే. ఇన్ని సుట్లుండవు. నా బతకనేక పోను గాని, నన్ను మల్ల మనువాడమని సెప్పకు, సెబితే, ఉరోసుకొని సత్తానంతే !"

దడివార నున్న కర్ర ఫళుక్కు విరుస్తూ చెప్పి పొయ్యి ఎగదోసింది గయిరి.

" ఇదేటోలమ్మ అణ్ణొగ్గేసినావు నానేటన్నేదు, అతడితోనే ఉందేటే, ఆడు కాకపోతే అంతకి మించి నోడు మరోడు. నే సెప్పినట్టు ఇనుకోయే. ఈ అప్పాయమ్మంటే ఏటనుకుంటున్నాడో. మన సంగతి తెల్దు."

అప్పాయమ్మ గొంతు పెంచింది.

"దాన్నేటనకే ...." ఒక్క కసురు కసిరాడు అసిరయ్య.

బొట్టి వంకా, దాని అయ్య వంకా మార్చి మార్చి చూస్తూ నుంచుండిపోయింది అప్పాయమ్మ. ''అమ్మాయిగోరు నాకు సదువు సెబుతామన్నారు. ఈయాల్టి వరకాడనే ఉన్నా, మరి నన్నేటనకు. అడదాయి కయినా మగోడికయినా నీతి ఒక్కటే కదా మరి అడు సచ్చిపోతే నేనేం జేద్దును....

'' మనసుంటే మడుసులందరూ అదే నీతికి కట్టుబడుండాల కదా పెదోల్లు సెప్పిన మాట.'' బొట్టి కళ్ళు మెరిసిపోతున్నాయి. తన బిడ్డేనా ఇలా మాటాడుతోందని పించి అలా చూస్తూ ఉండిపోయింది అప్పాయమ్మ.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

22-1-1986